క్లుప్తంగా

రీ సర్వేపై అభ్యంతరాలు ఉంటే తెలపండి

మామిడికుదురు: ఈదరాడ గ్రామంలో నిర్వహించిన రీ సర్వేపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకు రావాలని ఎమ్మార్వో జి.సునీల్‌కుమార్ తెలిపారు. ఈదరాడలో దీనిపై గురువారం గ్రామసభ నిర్వహించారు. రీ సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. వీటిని రైతులు సమగ్రంగా పరిశీలన చేసుకోవాలని సూచించారు. ఏవిధమైన మార్పులు ఉన్నా వాటిని తమ దృష్టికి తీసుకువస్తే వాటిపై పరిశీలన చేసి సవరిస్తామన్నారు. ఆర్వోఆర్ ప్రచురణకు ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. గ్రామ సభలో డిప్యూటీ ఎమ్మార్వో శరణ్య, ఆర్ఐ ఇబ్రహీమ్, కార్యదర్శి పీవీఆర్‌కే రాజు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన దినేష్‌కు రూ.50 వేల సాయం

అమలాపురం టౌన్: నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించిన పేద విద్యార్థి నామాడి దినేష్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన క్రమంలో అతని చదువు నిమిత్తం అమలాపురం గుడ్ సీడ్ ఫౌండేషన్ రూ.50 ఆర్థిక సాయం చేసింది. ఆ ఫౌండేషన్ ఫౌండర్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే వెంకట రమణారావు అమలాపురంలోని ఫౌండేషన్ కార్యాలయంలో అయినవిల్లి మండలం పెదపేటకు చెందిన విద్యార్థి దినేష్‌కు రూ.50 వేల చెక్‌ను గురువారం అందజేశారు. సాయంతోపాటు విద్యార్థి దినేష్‌ను గుడ్ సీడ్ ఫౌండేషన్ తరఫున రమణారావు ఘనంగా సత్కరించి అభినందించారు. విద్య ద్వారానే సమాజ వికాసం సాధ్యమవుతుందని, అందుకే విద్యా వ్యాప్తిని తన వంతుగా దినేష్‌కు ఈ సాయం చేశారని రమణారావు అన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు సరెళ్ల రామకృష్ణ, పరమట రాజశేఖర్, గంటా లక్ష్మీ ప్రసాద్, షేక్ బాబ్జి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిడుగు వెంకట రామమూర్తికి చిత్ర నివాళి

అమలాపురం రూరల్: తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాష రక్షణకు వారు చేసిన సేవలను స్మరించుకుంటూ అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ తెలుగు తల్లి గిడుగు వెంకట రామమూర్తి చిత్రాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి పెయింటింగ్ వేశారు.ఈ పెయింటింగ్ పలువురిని ఆకట్టుకుంది. అలాగే హాకీ క్రీడాకారుడైన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పోలిశెట్టి నరసింహ చంద్ర కుమార్ మేజర్ ధ్యాన్ చంద్ చిత్రాన్ని వేశారు. అలాగే వివిధ క్రీడాకారుల చిత్రాలను వాటర్ పెయింటింగ్స్ ఉపయోగించి వేశారు. ఈ పెయింటింగ్ పలువురిని ఆకట్టుకుంది.

అమరావతి చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన కోనసీమ క్రీడాకారులు ఆదిత్య రామ్ ప్రసాద్, గౌతమ్ కుమార్

అమలాపురం రూరల్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించాలని ఉద్దేశంతో ప్రభుత్వం తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అమరావతి చాంపియన్షిప్ బ్యాడ్మింటన్ పోటీల్లో కోనసీమ క్రీడాకారులు సత్తా చాటారు. బ్యాండ్మింటన్ డబుల్స్ విభాగంలో కోనసీమ జిల్లా చెందిన బొంతు ఆదిత్య రామ్ ప్రసాద్ (అమలాపురం)యాండ్రా గౌతమ్ కుమార్ (మలికిపురం) బంగారు పతకాలు సాధించారు. పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై విజయం సాధించారు. బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో యాండ్రా నంద కిషోర్ ఫైనల్స్‌లో విజయం సాధించి బంగారు పతకం సాధించాడు. ఈ ముగ్గురు క్రీడాకారులకు వైజాగ్‌లో 29 జరిగే క్రీడా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బంగారు పతకాలను అందుకుంటారు. రెండు విభాగాల్లో గోల్డ్ సాధించి నందుకు డీఎస్‌డీ పీఎస్ సురేష్ కుమార్, డీఈవో షేక్ సలీం భాషా, వ్యాయమ ఉపాధ్యాయులు, క్రీడాకారులు గురువారం అభినందించారు.

వినాయకుడికి 101 కిలోల లడ్డూ సమర్పణ

తాళ్లరేవు: గణపతి నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో లక్ష్మీగణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో వర్తక సంఘం సభ్యులు కంచమర్తి హరికృష్ణ, శ్రీదేవి దంపతులు స్వామివారికి పూజలు నిర్వహించారు. కాపులపాలెం గ్రామానికి చెందిన సలాది శ్రీనివాస్, చక్రవర్తి కుటుంబసభ్యులు స్వామివారికి 101 కిలోల భారీ లడ్డూను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. గ్రామ సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, యానాం తెలగా అభ్యుదయ కాపు సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి రామ్మూర్తి, ప్రముఖ వ్యాపారవేత్త తోటరాజు తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు పుగాకు వాసు, కమిటీ ప్రతినిధులు వనచర్ల రామకృష్ణ, కాంద్రేగుల సతీష్, అడబాల శివ, ఉండ్రు మాణిక్యాలరావు, ఖండవిల్లి నాని వర్తకులు పాల్గొన్నారు.

బాబోయ్ దోమలు

- బెంబేలెత్తుతున్న తీర ప్రాంత ప్రజలు
- దోమలకు ఆవాసంగా గ్రామాలు
- వ్యాధులు ప్రబలుతాయేమోనని భయాందోళన
- నిర్లక్ష్య ధోరణిలో అధికార యంత్రాంగం



డ్రైనేజీలో పూడిక తొలగించక పారని మురుగు నీరు

కాట్రేనికోన: మండల పరిధిలోని సముద్ర తీరప్రాంత గ్రామాల్లో పారిశుధ్యం పనులు మొక్కుబడిగా చేస్తుండటంతో అపరిశుభ్ర పరిసరాలతో దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలను కుడుతూ రోగాలబారిన పడేలా చేస్తున్నాయి. ప్రజలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా దోమ కాటు నుంచి తప్పించుకో లేకపోతున్నారు. గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్న అధికారుల్లో చలనం ఉండటం లేదు. గ్రామాల్లో దోమల బెడదతో జనం నానా అవస్థలు పడుతున్నా, అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. దోమ కాట్లతో కాళ్లు, చేతులు మండిపోతున్నాయిని, రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ లేదు

గ్రామ స్థాయిలో సుపరిపాలన అందించాలనే ధ్యేయంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. మండలంలోని 16 పంచాయతీల పరిధిలో 22 గ్రామ సచివాలయాలలో ఆయా శాఖలకు చెందిన సిబ్బందితో పాటు గ్రామ కార్యదర్శులను నియమించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సరైన పర్యవేక్షణ లేక సంబంధిత సిబ్బంది అలసత్వం వ్యవహరించడం వలన గ్రామాల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోతుంది. వర్షాలకు వ్యర్థాలు కల్లి పోయి దుర్వాసన వెదజల్లుతున్నా తొలగించే నాధుడు కరువైయ్యాడు. కందికుప్ప పంచాయతీ జమ్మి చెరువులో కాంగ్రెసు ప్రభుత్వంలో పేదలకు ఇల్లు స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి సీసీ రోడ్లు నిర్మించారు. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీరుదిగే పరిస్థితి లేక నీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో అధిక సంఖ్యలో స్థానికులు విషజ్వరాలతో మంచాన పడ్డారు.

పల్లంలో సర్పంచి ప్రతిపక్ష నాయకుడు కావడంతో విధులు సక్రమంగా చేయనివ్వకుండా అధికార పార్టీ నాయకులు చేతిలోకి తీసుకున్నాడు. సంబంధిత కార్యదర్శి మొక్కుబడిగా వ్యవహరించడంతో పంచాయతీలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది.

పారిశుధ్య లోపం

వర్షాలు కురుస్తుండడంతో, నీటి నిల్వలు పెరిగిపోతున్నాయి. డ్రైనేజీలు ఇంటి పరిసరాల్లో, ఉన్న గుంతలలో నీరు నిల్వ ఉండడంతో, అక్కడ ఆవాసాలు ఏర్పాటు చేసుకొని, వృద్ధి చెందుతున్నాయి. వర్షాలకు పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా మారుతుంది. మండలంలో పల్లం, చిర్రయానం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటి మొగ, పోర, పల్లంకుర్రు, కందికుప్ప గ్రామాల్లో మురికి కాలువలు గుంతలు నీటి నిల్వ కేంద్రాలు, దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారుతున్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పగలు రాత్రి అని తేడా లేకుండా జలగల్లాగా పట్టిపీడిస్తున్నాయి. పలు కాలనీల్లో ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. దోమల నివారణకు ప్రతి ఇళ్లల్లో కాయిల్స్, లిక్విడ్ సీసాల వినియోగానికి వందల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయినా దోమల బెడద పోవడం లేదు. అసలే వర్షాకాలం, అపరిశుభ్రత ఆపై చీకటి పడితే చాలు, ఏ వార్డుకి వెళ్లినా దోమల మోత వినిపిస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని, అన్ని గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పల్లం గ్రామం వంతెన ముందు పారవేస్తున్న వ్యర్థాలు



జమ్మి చెరువులో అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

కంటిమీద కునుకు కరవై..

అపరిశుభ్ర పరిసరాలు, పారిద్ధ్యం లోపించడంతో బలుసుతిప్ప, కొత్తపాలెం, పోర, పల్లంకుర్రు, చిర్రయానం గ్రామాల్లో దోమలు నిర్మూళన చర్యలు చేపట్టం లేదు. ఏడాది నుంచి గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల పల్లంలో లివర్‌కు సంబంధించిన సి వైరస్ కేసులు బయట పడ్డాయి. డ్రైనేజీ కాలువల వద్ద పిచికారీ, ఫాగింగ్ చేసి, దోమలను అరికట్టాలని, సాయంత్రం అయ్యిందంటే దోమలు విపరీతంగా వస్తున్నాయని అధికారులు స్పందించి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

గ్రామాల్లో వెంటనే పారిశుధ్య పనులు చేపడతాం. డ్రైనేజీల్లో పూడికలు తోలగించి, ఫాగింగ్ చేసి దోమల వ్యాప్తిని అరికడతాం. సిబ్బందితో బ్లీచింగ్ చల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

వెంకటాచలం,
ఎంపీడిఓ, కాట్రేనికోన

మత్స్యకారులకు నష్టపరిహారం ఇవ్వాలి

అమలాపురం రూరల్: ఓఎన్‌జీసీ పైప్‌లైన్ లీకేజీ వల్ల గాడిమొగ, భైరవపాలెంలో సముద్ర నీరు చమురుమయమై మత్స్య సంపదకు తీవ్ర నష్టం జరుగుతోందని, దీనివల్ల మత్స్యకారులకు చమురు సంస్థలు నష్టపరిహారం ఇవ్వాలని యానం ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదీ ఓఎన్‌జీసీ పైప్‌లైన్ లీకేజీ వల్ల మడ అడవులు కాలిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను అమలాపురం, కాకినాడ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, వనమాడి వెంకటేశ్వరరావులతో కలిసి నష్ట పరిహారం ఇప్పించాలని వినతిపత్రం సమర్పించారు. గత నవంబర్‌లో సీఎం చంద్రబాబు, ఎంపీ పురందేశ్వరి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కలసి ఈ విషయం వివరించామని, జరిగిన నష్టాలను సాక్ష్యాలతో సమాచారం ఇచ్చామని వారు పేర్కొన్నారు.

నాచు, పీతల పెంపకం యూనిట్లకు చర్యలు

సముద్రపు నాచు పెంచడం, పీతల హేచరీ స్థాపన, పీతల పెంపకానికి యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్ కుమార్ మత్స్య శాఖ డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పర్యావరణ, అటవీ శాస్త్రవేత్తలు డాక్టర్ మహమ్మద్ రఫీక్, డాక్టర్ జయంతి సుతార్ మత్స్యశాఖ అటవీ శాఖ, జిల్లా కోఆర్డినేషన్ అసోసియేట్ సభ్యులు డీఆర్డీఏ అధికారులతో సమావేశమై యూనిట్లు స్థాపనపై సమీక్షచేశారు. నిపుణులు తీర ప్రాంతంలో పర్యటించి ఈ మేరకు ప్రదేశాలను ఎంపిక చేస్తారన్నారు. జిల్లాలో తొలి దశలో 20 యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.

పింఛన్ల పంపిణీలో ప్రజా సంతృప్తిని మెరుగుపరచాలి

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ సేవల పట్ల ప్రజా సంతృప్తి స్థాయిలను మెరుగుపరచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నీటి సంరక్షణ, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు పూడికతీత, నవీనీకరణ తదితర అంశాలపై సమీక్షించారు.

వైభవోపేతంగా మహాలక్ష్మీ అమ్మవారి జాతర

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామదేవత శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని స్థానిక నదిలో స్నానం చేయిందుకు గ్రామస్థులందరూ ఊరేగింపుగా తరలివెళ్లారు. అమ్మవారికి పువ్వులు, నీళ్లు జల్లుతూ భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ కుటుంబ సమేతంగా తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. అనంతరం అమ్మవారిని ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రేకాడి వెంకటేశ్వర్లు, కొపనాతి నాగరాజు, సంగాడి ఈశ్వరరావు, పంతాడి నేరెళ్ల, పంతాడి ధర్మారావు, వైదాడి శ్రీనివాస్, కామాడి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పవన్ కుమార్

అమలాపురం రూరల్: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అమలాపురానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నల్లా పవన్ కుమార్ నియమితులయ్యారు. గురువారం పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు పవన్ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాజ్యసభ ఎంపీ పాకా సత్యనారాయణ, మాజీ రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకరన్ పలువురు పార్టీ నాయకులు అభిమానులు నల్లా పవన్‌ను అభినందించారు.

పి.మల్లవరంలో సినిమా షూటింగ్ ప్రారంభం

తాళ్లరేవు: సుభాష్ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ప్రొడక్షన్ నంబర్ 1 సినిమా షూటింగ్ గురువారం పి.మల్లవరం గ్రామంలో విల్ల వీరనాయుడు ఆధ్వర్యంలో ప్రారంభమైంది. స్థానిక గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో అర్చకులు ఖండవిల్లి రంగాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిత్ర హీరో, హీరోయిన్లు సూర్యశ్రీనివాస్, దివిజలపై చిత్ర నిర్మాత గరగ విజయభాస్కర్రావు క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు గరగ సుభాష్ మాట్లాడుతూ మంచి కథాంశంతో ఆసక్తికర సన్నివేశాలతో కుటుంబ సమేతంగా చూసేవిధంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. సుమారు 40 రోజుల పాటు యానాం పరిసర ప్రాంతాలలో షూటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంపన రామకృష్ణ, నాయకులు విల్ల సత్యన్నారాయణ, కుడుపూడి శివన్నారాయణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, సలాది శ్రీనివాస్ పాల్గొన్నారు.



పి.మల్లవరంలో సినిమా షూటింగ్‌ను క్లాప్ కొట్టి ప్రారంభిస్తున్న చిత్ర నిర్మాత విజయభాస్కర్రావు, చిత్రంలో దర్శకుడు సుభాష్, హీరో హీరోయిన్‌లు

వెంకన్న హుండీల ఆదాయం రూ.13.42 లక్షలు

అమలాపురం టౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలను గురవారం తెరిచి లెక్కించారు. గత 78 రోజులకు సంబంధించి హుండీల ద్వారా రూ.13.42 లక్షల ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. భక్తులు, శ్రీవారి సేవకులు సమక్షంలో దేవాదాయ, ధర్మదాయ శాఖ అమలాపురం తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది.

పన్ను బకాయిల వసూళ్లపై అంత నిర్లక్ష్యమా!



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి



పట్టణ అభివృద్ధిపై కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, కౌన్సిలర్లు

- రూ. 100 కోట్లతో పట్టణ రోడ్ల విస్తరణపై చర్చ
- చర్చించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు
- జనన మరణాల నకిలీ సర్టిఫికెట్లపై ఆరా

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో బకాయి పన్నుల వసూళ్లలో అంత నిర్లక్ష్యం ఎందుకు? ఎవరి నుంచైనా ఒత్తిడి ఉంటుందా అంత భయమెందుకు అంటూ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో పాటు పాలక పక్ష కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ చైర్పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం తొలుత బకాయి పన్నుల వసూళ్లలో జరుగుతున్న అలక్ష్యం వల్ల లక్షలాది రూపాయలు పేరుకుపోతున్నాయని ఎమ్మెల్సీతో సహ పలువురి కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. రూ.80 వేల నుంచి రూ.లక్ష దాటిన పన్నుల బకాయిదారుల వల్ల దాదాపు రూ.36 లక్షలు పెండింగ్‌లో ఉందని కౌన్సిలర్ నాగేంద్ర గుర్తు చేశారు. పన్నుల బకాయిలపై ఏమి చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కమిషనర్ వి.నిర్మల్ కుమార్‌ను ప్రశ్నించారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ చేసి బకాయి పన్నులను పూర్తిగా వసూలు చేస్తామని కమిషనర్ వివరించారు. పట్టణంలో పన్నుల బకాయిలు రూ.లక్ష దాటిన డిఫాల్డర్లు 44 మంది ఉన్నట్లు గుర్తించామన్నారు.

జనన మరణాల నకిలీ సరిఫికెట్లపై పోలీసులకు ఫిర్యాదు

మున్సిపల్ కార్యాలయంలో జనన మరణాల విభాగంలో కొందరు ఉద్యోగులు నకిలీ వెబ్‌సైట్‌లో నకిలీ సర్టిఫెకెట్ల జారీపై కౌన్సిలర్ సంసాని బులినాని సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అవకతవకలపై కౌన్సిలర్ ఆరా తీయగా ఈ తప్పిదంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని కమిషనర్ బదులిచ్చారు. దీనిపై ఎమ్మెల్యే ఆనందరావు జోక్యం చేసుకుని ఈ తప్పిదంపై కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయమని సూచించారు. దీంతో ఈ నకిలీ దందాపై కౌన్సిలర్ బులినాని కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

రూ.100 కోట్ల కోసం ప్రయత్నం చేస్తున్నాను

మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా పట్టణంలోని కొన్ని కీలక రోడ్ల విస్తరణకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు చేశామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సమావేశంలో వెల్లడించారు. పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా పలు రోడ్లను కనీసం 40 అడుగుల విస్తరణతో రోడ్లు ఉండాలన్నారు. రూ.100 కోట్ల కోసం ప్రభుత్వం నుంచి మంజూరు చేయించేందుకు తాను విశ్వ ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు. రూ.100 కోట్ల అభివృద్ధి అంశంపై ఎమ్మెల్యే ఆనందరావు, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు చర్చించారు.

190 ఏళ్ల కొంకాపల్లి చెడీ తాలింఖానా లోగో ఆవిష్కరణ

అమలాపురం టౌన్: దసరా ఉత్సవాల్లో ప్రదర్శించే చెడీ తాలింఖానా ప్రదర్శనలకు ప్రత్యేకత సంతరించుకుంటుంది. దసరా రోజు అమలాపురంలో ఏడు వీధుల వాహనాలకు, చెడీ తాలింఖానా ప్రదర్శనలకు ఏళ్ల తరబడిన ఉత్సవాల చరిత్రలు ఉంటాయి. ఇందులో భాగంగానే కొంకాపల్లి దసరా ఉత్సవ కమిటీ తమ వీధి చెడీ తాలింఖానా ప్రదర్శనలకు 190 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ లోగోను బుధవారం ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. కొంకాపల్లి లక్ష్మీ గణపతి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎంపీటీసీ సభ్యుడు పనసా బుజ్జి, మున్సిపల్ కౌన్సిలర్ చిక్కాల రాంబాబు, మాజీ కౌన్సిలర్ కురసాల బద్దాజీ, కమిటీ సభ్యులు దూలం బుజ్జి, ఇండిగుల ఆనంద్, పనసా అబ్బు, కురసాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ఐ.పోలవరం: మండలంలో లైన్‌పేటలో వీహెచ్‌పీఎస్ దివ్యాంగుల 18వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం నియోజవర్గం దివ్యాంగుల అధ్యక్షుడు జొన్నాడ రాజు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి మాదిగ, జంపన రామభద్ర రాజు, విత్తనాల గౌరీ, కంచర లక్ష్మీ, ఎంఆర్పీఎస్ నాయకులు ఉందుర్తి కిషోర్, కోమనపల్లి చిన్న మాదిగ, కోమనపల్లి సుబ్రహ్మణ్యం, వీధి శీను బాబు, పలివెల శ్రీనివాసరావు మాదిగలు పాల్గొన్నారు.

గడపకో గణపయ్య

- వైభవంగా గణనాథునికి పూజలు
- ఇంటింటా వెలసిన పాలవెల్లులు



ఉప్పలగుప్తం గ్రామంలో గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



ముమ్మిడివరం మార్కెట్ సెంటర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు

ఐ.పోలవరం: గణపతి నవరాత్ర ఉత్సవాలు మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఇంటా భక్తుల నుంచి గణపతి ఘనమైన పూజలు అందుకొన్నాడు. ఇంటింటా చవితి పాల వెల్లులు వెలశాయి. మండలంలోని రహదారులు అన్ని కోలాహలంగా కనిపించాయి. మురమళ్ల మాణిక్యాంబ నగర్‌లో గణపతి నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. వినాయకుని విగ్రహం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఉదయం నుంచి భజన కాలక్షేపం నిర్వహించారు. మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో కొలువైన గణపతికి లక్ష గరిక పూజా మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

ముమ్మిడివరం: విఘ్నాలను రూపుమాపే వినాయక చవితి వేడుకలను బుధవారం వాడవాడలా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముమ్మిడివరం బళ్ల గేటు సెంటర్ త్రిముఖ గణపతి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. మార్కెట్ సెంటర్ శ్రీలక్ష్మి గణపతి ఆలయం, శ్రీ పోలీస్‌స్టేషన్ సెంటర్ విజయ దుర్గా ఆలయాల్లోపాటు అన్ని వీధుల్లో గణపతి నవరాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

అమలాపురం టౌన్: పట్టణంలోని శ్రీరామపురం శివారు భాస్కర నగర్ కమిటీ కుర్రాళ్లు వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. భాస్కర నగర్ వినాయక ఉత్సవాలు 8వ వార్షికోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా 8 అడుగుల మట్టి విగ్రహాన్ని మంటపంలో ప్రతిష్ఠించారు.

అల్లవరం: మండలంలో వినాయక ఉత్సవాలను బుధవారం వాడవాడలా ఘనంగా ప్రారంభించారు. దేవగుప్తం సెంటర్లో విజయదుర్గ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో వినాయక విగ్రహాన్ని జోగి ఓంకార్, వరలక్ష్మీ దంపతులచే కలశ స్థాపన చేసి స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మండలంలో కొమరగిరిపట్నం, అల్లవరం, కోడూరుపాడు, బెండమూర్లంక, ఓడలరేవు, ఎంట్రుకోన తదితర గ్రామాల్లో గణపతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోనిగణపతి మందిరాల్లో గణనాథునికి ఘనంగా పూజలను నిర్వహించారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో అర్చకులు భైరవభట్ల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలను జరిపారు.

యానాం: వినాయకచవితి వేడుకలు బుధవారం యానాంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక పిల్లారాయవీధిలో పిళ్లయ్యార్‌స్వామి ఆలయంలో తెల్లవారు జామునుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ గణనాథుని విగ్రహాలకు విశేషపూజలు నిర్వహించారు.

అప్పుడు బద్దలకొట్టమన్నారు...ఇప్పుడు బిగిస్తున్నారు

అమలాపురంలో వామ పక్ష పార్టీల ఆందోళన



అమలాపురంలో నిరసన తెలుపుతున్న జిల్లా వామ పక్ష పార్టీల నాయకులు

అమలాపురం టౌన్: ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు అండ్ కో నాయకులు విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే బద్దలకొట్టమని ప్రజలను రెచ్చగొట్టి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వారి ఆదేశాలతోనే అవే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. విద్యుత్ పోరాట వీరుల సంస్మరణ దినంగా సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక విద్యుత్ విధానాలకు నిరసనగా గురువారం నిర్వహించిన ప్రతిజ్ఞా కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. 2000 సంవత్సరంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉభయ తెలుగు రాష్ట్రాల అప్పటి రాజధాని హైదరాబాద్ బషీరాబాగ్‌లో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటంలో పోలీసుల తుపాకీల కాల్పులకు ముగ్గురు ప్రాణాలు విడిచారని వెంటేశ్వరరావు గుర్తు చేశారు. నాటి విద్యుత్ వ్యతిరేక పోరాటం అణిచివేతకు చంద్రబాబు ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ కాల్పుల దమన కాండను ఆయన స్పష్టం చేశారు.ఆ మారణ కాండలో మృతి చెందిన అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా ఈ ప్రతిజ్ఞా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పుడు చంద్రబాబు పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. నాడు పగలగొట్టమన్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇప్పుడు అదే చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ఆ మీటర్ల బిగిస్తూ వారి ద్వంద్వ వైఖరితో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు జిల్లా వామ పక్షాల పార్టీలు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే బద్దల కొట్టమని వినియోగదారులకు పిలుపు ఇస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు, విద్యుత్ సంస్కరణలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకునే వరకూ పోరాడతామని సీపీఎం, సీపీఐ నాయకులు ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమంలో వామ పక్షాల పార్టీల నాయకులు జి.దుర్గా ప్రసాద్, తులసీ దుర్గారావు, బుంగ సత్యనారాయణ, పాము బాలయ్య, చెల్లబోయిన తాతారావు, గూడాల వెంకటరమణ, సరెళ్ల శివ, ముంగండ దుర్గాబాయి, పుల్లెల ఆనంద్ పాల్గొన్నారు.

వేదశాస్త్ర పండితులకు సత్కారం

తాళ్లరేవు: మండల పరిధిలోని ఇంజరం రుక్మిణీ, సత్యభామ సమేత విజయగోపాల స్వామివారి ఆలయ ప్రాంగణంలో గురువారం శ్రీ వేద శాస్త్ర పండిత సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ మావుళ్లమ్మ దేవస్థానం ఆస్థాన వేద పండితులు బ్రహ్మశ్రీ ఈమని వెంకట రామచంద్ర సోమయాజి అధ్యక్షతన వేదసభను నిర్వహించారు. కార్యక్రమానికి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి చతుర్వేద పండితులు సుమారు వందమంది హాజరయ్యారు.

కొలువులు సాధించిన యువతకు సత్కారం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన నలుగురు యువకులు పోలీసు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉద్యోగాలు సాధించిన కొపనాతి ఉదయ్‌భాస్కర్, కొపనాతి జానకిరాముడు, కొపనాతి సాయిదేవా, కర్రి సూర్యనారాయణలను దుశ్సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

వెంకటేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

అల్లవరం: దేవగుప్తంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే రమణారావు గురువారం పరామర్శించారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, పినిపే జయరాజ్, పడమట రాజ్‌కుమార్, సాధనాల శ్రీను, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.